సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సమన్వయంతో సుస్థిర అభివృద్ధి



డీపీవో శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక

తగరపువలస: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అనుకున్న అభివృద్ధి సాధించవచ్చని ఆనందపురం ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక అన్నారు. మూడు మండలాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2025–26 శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలలో సుస్థిరమైన అభివృద్ధి సాధించుకోవడానికి అవసరమైన అంశాల గురించి మాట్లాడారు. డీపీవో ఎంపీఏ శ్రీనివాసరావు ఈ శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించి, సూచనలు చేశారు. ఆయనను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జానకి, డిప్యూటీ ఎంపీడీవో బి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్‌లు కలిమి గంగరాజు, జీవీ నారాయణ, పిణగం అప్పలరాజు, ముద్దాడ అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద యువతులకు మెరుగైన ఉపాధి కోసం ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో 30 మంది పాల్గొంటున్నారన్నారు. ఆసక్తి గలవారు 96432 22666 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

దీనదయాళ్‌కు నివాళి

పద్మనాభం: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పద్మనాభం జంక్షన్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు కార్మిక ద్రోహమే..

మధురవాడ: కార్మికుల పని గంటల పెంపు అంటే వారికి ద్రోహం తలపెట్టినట్టేనని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మధురవాడ జోనల్ ఆఫీసు అంబేద్కర్ విగ్రహం వద్ద ముఠా కార్మికులు గురువారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 135 ఏళ్ల క్రితం చారిత్రాత్మక పోరాటం ద్వారా సాధించుకున్న 8గంటల పని దినాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం 10 గంటలకు పెంచుతూ తీర్మానం చేయడం దారుణమన్నారు ముఠా కార్మిక సంఘం నాయకులు బంగారయ్య, టి.అప్పలరాజు, చిన్నారావు పాల్గొన్నారు.

'యాత సామాజిక వర్గాన్ని ఆదుకోవాలి'

తగరపువలస: రాష్ట్రంలో వెనుకబడిన వర్గానికి చెందిన యాత కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆనందపురం మండలం కల్లుగీత కార్మికుల సంఘం ప్రతినిధులు కుప్ప రాజశేఖర్, ముడసల శ్రీను, కుప్ప చెంచునాయుడు కోరారు. వారు గురువారం ఆనందపురంలో మాట్లాడారు. గీత కార్మికుల కుటుంబాల వారు తమ కుల ధ్రువీకరణ పత్రాలలో గౌడ, శెట్టిబలిజ అని కాకుండా యాత అని రాయించుకోవాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన యాత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లన్నరెడ్డికి నివాళులు



ఇల్లన్నరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: ఇటీవల మరణించిన జీవీఎంసీ రెండోవార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సరగడ ఇల్లన్నరెడ్డికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. చిల్లపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. బైటోభజన ఏర్పాటు చేశారు.పార్టీ రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల భాషారెడ్డి, సరగడ సూర్యనారాయణరెడ్డి, కొసన సూరిరెడ్డి, దెక్కత శ్రీనివాసరెడ్డి, చిల్ల సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.



వర్షపునీరు, గాబుతో నిండిపోయిన బీరతోట

'బీర'కు వర్షం దెబ్బ

- వర్షాలకు చవుడుబారిన భూములు
- తెగులు సోకి తెల్లగా మారిన ఆకులు
- తెల్లదోమ కారణంగా ఎండిపోయిన పాదులు
- పొలాల్లోనే వదిలేసిన గాబు
- పెట్టుబడిలో మూడో వంతు కూడా రాక దిగాలుగా రైతులు



వర్షాల కారణంగా చవుడుబారి మాడిపోయిన బీరతోట

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండలం బీరసాగుకు ప్రసిద్ధి. మండలంలోని తర్లువాడ, ముచ్చర్ల, కణమాం, గిడిజాల, గంభీరం, కోలవానిపాలెం, భీమన్నదొరపాలెం, పాలవలస, బంటుపల్లి కళ్లాలు, పెద్దిపాలెం, శొంఠ్యాం పంచాయతీలలో ఎక్కువగా బీరసాగు చేస్తారు. ఎకరాకు రూ.30 వేల పెట్టుబడితో నాలుగు నెలల్లో ఒకటిన్నర రెట్ల నుంచి మూడు రెట్లు ఆదాయం కురిపించే బీరసాగును ప్రతి కుటుంబం సాగు చేస్తుంది. కనీసం 50 సెంట్లు నుంచి గరిష్టంగా ఎకరాల వరకు సాగు చేస్తారు. కొద్దిమంది రైతులు మాత్రం ఎకరాలలో సాగు చేస్తుంటారు.

జూన్ చివరి వారంలో విత్తనాలు పెడితే సెప్టెంబరు మొదటి వారం నుంచి డిసెంబరు వరకు బీర కాయల దిగుబడి ఉంటుంది. **కానీ ఈ ఏడాది ఆగస్ట్, సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షాలకు పంట భూములు చవుడుబారి** దిగుబడి తగ్గిపోయింది. చెరువులను ఆనుకుని, పల్లపు ప్రాంతాలలో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో ఎర్ర తెగులు సోకి ఆకులు తెల్లగా మారిపోయాయి. తెల్లదోమ కారణంగా పాదులకు పాదులు ఎండిపోయాయి. దీంతో కూలి ఖర్చులు కూడా దండగని రైతులు గాబు తీయించక నీటిలోనే వదిలేశారు. దీంతో పాదులకు కాసిన కొద్దిపాటి కాయలు పాదులకే పిందె దశలో కుళ్లిపోవడం, ఎదుగుదల లేకపోవడంతో మూరెడు సైజు పెరగవలసిన బీరకాయలు జానెడు సైజుకు పడిపోయాయి. మెరక భూములలో వేసిన పంట తప్ప పల్లపు ప్రదేశంలో ఎక్కువగా ఉండటం వలన 80 శాతం వరకు రైతులకు నష్టాలే మిగిలాయి. పెట్టుబడిలో మూడో వంతు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **బీర తరువాత ఎక్కువగా సాగు చేసే బొప్పాయి కూడా నష్టాలు** మిగిల్చిందని అంటున్నారు.



పందలపాకలో మామిడితోటలో అంతరపంటగా బీరపాదులు



మార్కెట్‌కు తరలించడానికి సేకరించిన బీరకాయలు

బీర సాగు చేయడానికి ప్రధానంగా కొండకర్రను వినియోగిస్తారు. కొండల మీద నుంచి 50 మోపుల కర్ర రూ.300 వంతున కొనుగోలు చేసి ఎకరా భూమిలో పాతుతారు. కర్ర కొనుగోలు, వీటి రవాణా, పాతడానికి ఎకరానికి రూ.20వేలు అవుతుంది. ఇలా పాతిన కర్రలు రెండేళ్ల పనికి వస్తాయి. సొంతంగా కట్టిన విత్తనాలు దుక్కి సమయంలో వేపపిండి, పశువుల గెత్తం, డీఏపీ, యూరియా, పొటాష్‌లకు, గొప్పులకు మరో రూ.10వేలు ఖర్చు అవుతుంది. సీజన్ అనుకూలిస్తే ఎకరాకు 60 బాక్స్‌ల వరకు దిగుబడి వస్తుంది. సీజన్ ప్రారంభంలో 35 కిలోల బాక్సు ధర రూ.800, చివరకు వచ్చేసరికి గరిష్టంగా రూ.1800 వరకు చేరుకుంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో హోల్‌సేల్‌గా బాక్స్ బీరకాయల ధర రూ.1100 ఉండగా చిల్లరగా రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. సీజన్ ముగిసే నాటికి గరిష్టంగా కిలో బీర రూ.80 వరకు అమ్ముడుపోతుంది.

వర్షాలకు దొరికిపోయాం



ఏటా అత్యధిక ఆదాయం బీర సాగు ద్వారానే వస్తుంది. మేము లీజుకు తీసుకున్న మామిడితోటలో బీర పాదులు పెట్టాం. రెండు నెలల పాటు అత్యధిక వర్షాలు కురవడంతో పూత తగ్గిపోయి మూడో వంతు నష్టాలు మిగిలాయి. అడపాదడపా కొంచెం కొంచెం ఏరి రోడ్ల పక్కన విక్రయిస్తున్నాం.

– గండిబోయిన రామలక్ష్మి, పందలపాక

తోటలు మాడిపోయాయి



మా పంచాయతీలో ఎక్కువగా బీర సాగు పల్లపు ప్రాంతాల్లోనే సాగుతుంది. మడులలో నీరు నిలిచిపోవడంతో భూములు చవుడు బారిపోయి కొన్ని చోట్ల ఆకులు నల్లగా మారిపోయాయి. దీంతో గొప్పులు కూడా తీయించడం మానేశాం. గతేడాది కూడా వర్షాల కారణంగా బీర రైతులు నష్టపోయారు. మాకు అర ఎకరం పంట పోయింది.

– మజ్జి అచ్చియ్యమ్మ, తర్లువాడ

కూలీలతో చేయించిన వారికి ఇంకా నష్టం



రైతు కుటుంబాలు సొంతంగా పని చేసుకుంటూ సాగు చేస్తే కొంత మేర నష్టాలు తగ్గుతాయి. చాలా మంది కూలీలతో పనులు చేయించుకుంటారు. వారానికి పది మందిని గొప్పుకు పెట్టి రూ.3వేలు, టీ, టిఫిన్లు, కూల్‌డ్రింకులు ఇవ్వాలి. డీఏపీ చల్లాలి. దిగుబడి లేకపోతే ఇదంతా నష్టమే కదా.

– కోరాడ గౌరి, తర్లువాడ

అధినేతతో ఆత్మీయ భేటీ



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె సిరిసహస్ర గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో ఆయన్ను కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

హాకర్స్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు



హాకర్స్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతాలలో ఒక్కటి

మధురవాడ: చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా వ్యాపార స్థలాలు చూపించేందుకు జీవీఎంసీ అధికారులు సానుకులత వ్యక్తం చేశారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ఏసీపీ శాస్త్రితో జోనల్ ఆఫీసులో సమావేశమై చర్చించారు. వీటిపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది, మారికవలస పరిసర ప్రాంతాల్లో 12 ప్రదేశాలను సీఐటీయూ, ఇతర చిల్లర వర్తక సంఘం నాయకులు హాకర్స్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు.

ప్రతిపాదిత స్థలాలు ఇవీ..

పీఎం పాలెం రామాలయం ఎదురుగా, హైవేలో మ్యాక్స్ పక్కన ఉన్న జీవీఎంసీ రోడ్డు స్థలం, మధురవాడ విద్యుత్‌శాఖ, హాస్టల్స్ ఎదురుగా ఉన్న పార్కు స్థలం, గణేష్ నగర్ గణపతి ఆలయం వద్ద గల బస్టాప్ ప్రాంతం, మిథిలాపురి వుడా కాలనీ జంక్షన్ వద్ద, యమహా షోరూంల వద్ద గిఫ్ట్ డీడ్ స్థలాలు, గాంధీ సెంటర్ కల్యాణ మండపం పక్కన ఉన్న పార్కు స్థలం, ఆదిత్య అపార్ట్‌మెంట్, ఖుషీ షాపింగ్ మాల్, ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న స్థలాలు, మిథిలాపురి వుడా కాలనీ వికలాంగులకాలనీ వద్ద గల ప్రభుత్వ స్థలం, జోనల్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఎండోమెంట్ భూమి, మారికవలస ఆనందపురం వైపు వెళ్లే బస్టాప్ వెనుక ఉన్న డీ ఫారం స్థలాలను యూనియన్ నాయకులు సూచించారు.

నిబద్ధత గల నాయకుడు బర్ధన్



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: విలువలతో పాటు నిబద్ధత గల నాయకుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు అన్నారు. బర్ధన్ 101వ జయంతి సందర్భంగా మధురవాడ సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పైడిరాజు మాట్లాడుతూ బర్ధన్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. సీపీఐ నాయకులు సత్యనారాయణ, ఏండీ బేగం, జి.వేళంగిణిరావు, బి.కేశవయ్య, ఎస్‌కే సల్మ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప కమ్యూనిస్ట్ యోధుడు

తగరపువలస: కమ్యూనిస్ట్ పార్టీ తొలితరం నాయకుడు ఏపీ బర్ధన్ 101వ జయంతి సందర్భంగా గురువారం గుజ్జు రామునాయుడు భవన్‌లో సీపీఐ, చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనేక కార్మిక, కర్షక ఉద్యమాలు చేసి జైలు జీవితం గడిపిన గొప్ప కమ్యూనిస్ట్ యోధుడని కొనియాడారు. చిల్ల నరసింహులు, కానూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిల్లర వర్తకుల ఆందోళనకు తాత్కాలిక తెర

- దసరా వరకు తోపుడు బళ్లతో వ్యాపారానికి అనుమతి
- ఫలించిన యూనియన్ నాయకులు, అధికారుల చర్చలు



జెడ్సీ కనక మహాలక్ష్మితో పోలీసుల సమక్షంలో చర్చలు జరుపుతున్న కార్మిక నాయకులు

మధురవాడ: చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల వ్యాపారుల ఆందోళనకు తాత్కాలికంగా తెరపడింది. దసరా వరకు తోపుడు బండ్ల ద్వారా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు జీవీఎంసీ అధికారులు అనుమతి ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం భారీ ఆందోళన, వంటావార్పునకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో పీఎం పాలెం ఎస్ఐలు భాస్కరరావు, సునీత సమక్షంలో జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మితో యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. హాకర్స్ జోన్లు కేటాయించి, ఉపాధి చూపేంతవరకు ప్రస్తుతం వ్యాపారం చేసుకున్న చోట్ల దుకాణాలు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, అప్పలరాజు, ఆదినారాయణ తదితరులు కోరారు. జెడ్సీ కనక మహాలక్ష్మి దీనికి స్పందిస్తూ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడానికి వీల్లేదని, ఫుట్‌పాత్ వెలుపల తోపుడు బండ్లు పెట్టుకుని, పాదచారులకు, ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా తోపుడు బండ్లు ద్వారా మాత్రమే వ్యాపారం చేసుకోవచ్చునని చెప్పారు. దీంతో ఇరువర్గాలు అంగీకరించాయి. సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యేంత వరకు పోరాడతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, సురేష్, పి. వరలక్ష్మి, వ్యాపారులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తోపుడు బళ్ల వ్యాపారులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలంలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా మండలంలోని పల్లిపేట, మచ్చవానిపాలెం, గొట్టిపల్లి, కుసులవాడ, రేగానిగూడెం, చిన్నయ్యపాలెం, రామినేనిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం



చిన్నాపురంలో పౌష్టికాహార ప్రదర్శన

పద్మనాభం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం ఆరగించడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జియా ఉన్నీషా అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండలంలోని చిన్నాపురంలో గురువారం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న బాల సంజీవిని కిట్లలో ఉన్న కర్జూరం, పప్పు చిక్కీలు, అటుకులు వంటి ఆహార పదార్థాలను తినాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపు అన్యాయం

- భీమిలి జోనల్ కార్యాలయం వద్ద చిరు వ్యాపారుల ఆందోళన



భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

భీమునిపట్నం: చిరు వ్యాపారుల బడ్డీలను అకస్మాత్తుగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ భీమిలి జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు అన్నారు. తగరపువల ఈఎస్ఐ ఆస్పత్రి గోడను ఆనుకుని ఉన్న బడ్డీలను తొలగింపునకు నిరసనగా వ్యాపారులు భీమిలి జోనల్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ 56 కుటుంబాలు బడ్డీలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాయని, కానీ, ఇప్పుడు బడ్డీలను తొలగించడం వల్ల కుటుంబాలు రోడ్డున పడిపోయాయన్నారు. వ్యాపారులు మాట్లాడుతూ తమ పరిస్థితి గందరగోళంగా మారిందని, ఎలా బతకాలో తెలియడం లేదని వాపోయారు. తమకు వేరేచోట స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నేలతి రాము, నర్సింగరావు, రామునాయుడు, కనకరాజు పాల్గొన్నారు.

జెడ్సీకి వినతి

భీమిలి మెయిన్‌రోడ్డులో వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులు తమకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జెడ్సీ అయ్యప్పనాయుడిని కలిసి వినతిపత్రం అందించారు. తమ బడ్డీల వెనుక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఖాళీప్రదేశంలో అవకాశం కల్పించాలని కోరారు. వ్యాపారులు పూసర్ల నరేంద్ర, గుండాసి మధునాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



గంభీరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో శ్రీనివాసరావు



వేములవలస ఫ్లై ఓవర్ కింద వ్యర్థాలను ఏరివేస్తున్న ఐటీబీపీ సిబ్బంది

తగరపువలస: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యంగా జీవిద్దామని జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి ఎంపీఏ శ్రీనివాసరావు కోరారు. ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్ సాత్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశుద్ధ్య పనులపై అవగాహన, పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య సేవలు చేయించిన అనంతరం వారికి బీమా సదుపాయాలు కలిŀంచిన బాండ్లు, నిత్యావసర సరకులు అందించారు. ఎంపీడీవో వి.జానకి, డిప్యూటీ ఎంపీడీవో బి.సత్యనారాయణ, సర్పంచ్ వానపల్లి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఐటీబీపీ ఆధ్వర్యంలో..

ఆనందపురం మండలం వేములవలస ఫ్లై ఓవర్ కూడలిలో పందలపాక ఐటీబీపీ 56వ బెటాలియన్ కమాండెంట్ హరిసింగ్ ఆధ్వర్యంలో 30 మంది సిబ్బంది స్వచ్ఛభారత్ అభియాన్ నిర్వహించారు. డిప్యూటీ కమాండెంట్ రమేష్ సేనాపతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం 6 గంటల నుంచే ఆనందపురం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు భాగస్వాములయ్యారు. వీరంతా మార్కెట్ పరిసరాలలో పాలిథిన్, కాయగూరల వ్యర్థాలు, చెత్త సేకరించి పరిసరాలను శుభ్రం చేశారు.

'స్వచ్ఛతా హీ సేవ'లో బీవోబీ ఉద్యోగులు

భీమిలి బీచ్‌లో గురువారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది పాల్గొన్నారు. బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి మిగిలిన వారికి సహకరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్.రామునాయుడు, అసిస్టెంట్ మేనేజర్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో స్వచ్ఛత

పద్మనాభం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు కోరారు. పద్మనాభం గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జయ ఉమ, మాజీ జెడ్పీటీసీ కళిరెడ్డి దామోదరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, హౌసింగ్ ఏఈ పద్మజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, వెలుగు ఏపీఎం బీవీ రమణ పాల్గొన్నారు.

కాత్యాయనిగా కనకదుర్గమ్మ



భీమిలి శివాలయంలో కాత్యాయనిగా దుర్గాదేవి



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కాత్యాయని అవతారంలో..



ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిచ్చారు. భీమిలిలోని చౌడేశ్వరాలయంలో, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో కాత్యాయినీ మాతను బిల్వ పత్రాలతో అర్చించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధురవాడ టైలర్స్ కాలనీ విజయ దుర్గాదేవి ఆలయం, త్రిశక్తి ఆలయంతో పాటు ఆనందపురం మండలంలోని లొడగలవానిపాలెం, బోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద పూజలు జరిగాయి. సాగర్‌నగర్ మొగదారమ్మ గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఎండాడ దుర్గమ్మ ఆలయంలో, కొమ్మాది అష్టలక్ష్మి దేవాలయంలో దేవీ నవరాత్రులు వైభవంగా నిర్వహించారు.



ఆనందపురం మండలం బోనిలో..



మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా..

– భీమునిపట్నం/తగరపువలస/మధురవాడ/కొమ్మాది



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో కాత్యాయినీ దేవిగా దుర్గామాత



దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలకు విశేషంగా హాజరైన మహిళలు